
## నగ్నముని

### విలోమ కథ

# లైకా-మజ్నూ ప్రణయగాథ



( ఇంగ్లీషులో వున్న 'యాంటీలిటరేచర్' అనే మాటకి తెలుగే 'విలోమ సాహిత్యం' ఈ విలోమ సాహిత్యంలో తొలి కథా ప్రక్రియ కనుక ఇది విలోమ కథ అయింది. విలోమం అంటే 'తలక్రిందులు' అనే నైఘంటికార్థమే ఇక్కడ అన్వయిస్తుంది. —ఎడిటర్ )

మళ్ళీ ఎండల కాల మొచ్చింది. చెట్లుమంటలు పూస్తున్నయ్. కొండలు నిప్పుసుద్దలయినయ్. నేలపెనం మీద యిసక వేడెక్కి వేగిపోతోంది. కాలవల్లో నీళ్ళు కరిగిన యినుంలా ప్రవహిస్తున్నయ్. భూమి పగిలిన నరాలు కనబడుతున్నయ్.

భగ్గునమండుతున్న ఎండాకాలాన్ని చలి కాలంగా చేసెయ్యాలని ఎండల్నిమించి మండుతు న్నయ్ ధరలు.

ఆఫీసునుంచి వుస్సురని సైకిల్ తొక్కు కొస్తూ, సైకిలే తనని తొక్కుతున్నట్లుగా యింటికొచ్చాడు కుక్కు టేశ్వర్రావ్. సైకిల్ని గోడకి తగిల్చి, గబగబా చొక్కాలాగూ

వంటింట్లో జానకమ్మకి తాపంగానే వుంది. మొగుడికి గబగబా కాఫీలాంటిది కానిచ్చేసి మళ్ళీ నీళ్ళోసుకుంది. తర్వాత తీరిగ్గా ఆపసోపాలుపడుతూ ఆసుపత్రి కెళ్ళి నీళ్ళాడేసింది. మళ్ళీ ఆడపిల్ల.

కుక్కుటేశ్వర్రావ్‌కి మళ్ళీ బదిలీఅయింది. ఇది నాలుగోసారి అతనికి యీ మూడేళ్ళలో.

నాడో, నాలుగోనాడో కుక్కుటకి బదిలీ అవు తూంటుంది. అతనప్పుడు ఆవదం తనే తాగి నట్లు ముఖం పెడతాడు. ఆ-ముదమొచ్చెగ సఖీ అనే కీర్తనలా. అందుకని జానకమ్మకి పురుడొస్తుందనగానే సామానంతా చక్కగా సర్దేసుకుని కూచుంటాడు. బదిలీ అనగానే తనకే పురుడొచ్చినంత పనవుతుంది కుక్కుటకి.

# తెలుగులో మొట్టమొదటి 'విలోమకథా' ప్రయోగం

విప్పేశాడు, చెమట కారుతున్న చర్మాన్ని కూడా విప్పేద్దామనుకున్నాడు. చాతకాలేదు. బ్రాత్రూంలో దూరి పంపుకింద పద్మాసనం వేసి ఆ రోజులో రెండోసారి నీళ్ళోసుకుని, బనీనూ డ్రాయర్తో అరుగుమీదకొచ్చి గోడ నానుకుని బాసి పటేసుకుని సైకిల్ వెనక కట్టుకొచ్చిన కట్టల్ని విప్పి ఆఫీసుపని యింటి దగ్గర మొదలెట్టాడు.

జానకమ్మకి యిది ఎనిమిదోసారి యీ పదేళ్ళలో. కుక్కుటేశ్వర్రావు ఆఫీసు లోనూ, యింట్లోనూ ఒళ్ళు దాచుకోకుండా పన్జేస్తాడు.

జానకమ్మది ఎప్పుడూ సాఫీకాన్పే. రాళ్ళ లాంటి పిల్లల్ని అవురావురుమనే నోళ్ళతో కనేస్తుంది, తల్లీ పిల్లా కులాసాగా వుంటారు. పుట్టినపిల్ల మాడుకి ఆవదంపెట్టిన మూడో

పెళ్ళాం పిల్లల్ని రెక్కలకి తగిలించు కుని, మంచాలూ కుర్చీలూ మెళ్ళోవేసుకుని, మూటాముల్లే ముక్కుకి దూర్చుకుని అప్పుడే పుట్టిన చంటిపిల్లకి గుడ్డవుయ్యాల డొక్కలకి వేసుకుని మరో వూరికి ఎగురుతుంటాడు కుక్కుటేశ్వర్రావ్.

అతను చాలా మంచి పురుషుడు,
చిన్నప్పుడు తలిదండ్రులమాట విన్నాడు.

చదువుల రోజు పంతుళ్ళమాటల్లో విన్నాడు. ఆఫీసులో తన నెత్తిమీద కుర్చీవేసుకుని కూర్చునే ప్రతి ఆఫీసరు మాటా వింటున్నాడు. దినపత్రికలు, రేడియో చెప్పేది నిజంగానే నిజమని నమ్ముతూ వింటున్నాడు. వినడం అలవాటయిపోవడం వల్ల పెళ్ళయ్యాక జానకమ్మ మాట వింటున్నాడు, అతనికి యిది తప్ప మరే దురభ్యాసమూలేదు. అతనికి జానకమ్మతో తప్ప ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధం లేదు.

## 2

కొత్తగా బదిలీ అయిన వూళ్ళో కుక్కకి తెలిసిన వాళ్ళెవరూ లేరు. నిజానికి ప్రస్తుతం వున్న వూళ్ళోకూడా అతనికి తెలిసినవాళ్ళెవరూ లేరు. అన్నిముఖాలూ అతనికి ఒకే రకంగా కనబడేవి. అందువల్ల ఎవర్నీ చప్పున గుర్తుపట్టలేకపోయేవాడు, అంతెందుకు, పెళ్ళయి నలుగురు పిల్లలు పుట్టాక జానకమ్మని చాలాసార్లు పనిమనిషెమోనను కునేవాడు. వాళ్ళింట్లో పనిమనిషి పోస్టులేక పోవడంవల్లా, రాత్రుళ్ళు జానకమ్మని తిరిగి పెళ్ళాంగా పోల్చుకోక తప్పకపోవడం వల్లా ఆ కాపరం నిలబడింది.

కూరగాయలు కూడా అన్నీ ఒకేరకంగా అతనికి కనబడేవి. పుచ్చొంకాయలు తెచ్చాడని జానకమ్మ మొగుడిమీద విరుచుకుపడేది. అసలీ కూరగాయల్లో యిన్ని పార్టీలెందుకున్నాయో, యీ పుచ్చొంకాయపార్టీ తన కోసమే మార్కెట్లో ఎదురుచూస్తూ తనసంచీలోకి దూరి యింటికొచ్చి తన నెందుకిలా వేధిస్తున్నదో అతనికి అర్ధమయ్యేదికాదు.

పుచ్చొంకాయలే కాదు, ఏ కూరగాయలు తీసుకొచ్చినా జానకమ్మ ముఖంలో పొద్దు పొడిచేదికాదు. అసలు జానకమ్మ ఏ కూరగాయల పార్టీయో తెలుసుకుందామని అప్పుడప్పుడూ ప్రయత్నించేవాడు కుక్క. కానీ యింతలో అర్జెంటు ఫైళ్ళలో తలదూర్పవలసొచ్చి వుష్ట్రపక్షి అయిపోయేవాడు. తిరిగి కాస్త సమయం దొరికి ఆలోచించడానికి తలెత్తిచూస్తే తనపక్షి రెక్కలూడిపడి పిల్లల రూపంలో కిందనేలమీద గుక్కపట్టి దొర్లుతూ కనిపించేవి.

యధాప్రకారం కొత్తవూళ్ళొని కొత్తాఫీసులో జాయిన్ కావడానికి ఓ వారంరోజుల ముందు నాడు యిల్లు వెతకడం కోసం పొద్దున్నే ఆ వూరొచ్చి ఆ వూళ్ళో కోళ్ళకంటే ముందుగా తనే కొక్కొరొకో మన్నాడు కుక్క, కోడికూత ఆఫీసులోనే వినడం అలవాటయిన ఆ ఆఫీసు వాళ్ళు బయటికొచ్చి చూసి ఆ కొక్కొరొకోని అర్ధం జేసుకుని అంతా సైకిళ్ళేసుకుని కుక్కకి యిల్లు చూడ్డంకోసం బయల్దేరారు. అన్ని యిళ్ళు గర్భిణీ స్త్రీల్లావున్నాయి. కొన్ని ముష్టివాళ్ళలా వున్నాయి. కొన్ని డొగుడు బావుల్లా వున్నాయి. కానీ ఎక్కడా పెళ్ళి కావలసిన యిళ్ళు కనబడలేదు. ఇంతలో ఒక కాకి ఎక్కణ్ణుంచి వొచ్చిందో ఏయింటి మీదా వాలకుండా ఎగురుతోంది కావుకావుమంటూ. కుక్క ఆఫీసుమిత్రుల్లో ఒకతనికి పక్షి భాష తెలుసు. ''దాని వెంటపోదాం పదండ్రా'' అన్నాడు. పైన కాకి ఎగురుతోంది, క్రింద దానివంకే చూస్తు సైకిళ్ళు తొక్కుతున్నారు కుక్క, కుక్క మిత్రులు. కాకి కావు కావు మనడం ఆపలేదు. ఏ యింటి మీదా వాలలేదు. కాకితో మాట్లాడుతూనే వున్నాడు కాకి భాష తెలిసిన కుక్క మిత్రుడు. కాకీ, కాకేశం కాకి భాషలో చాలా విషయాలు మాట్లాడుకున్నారు. కుక్క గురించీ, కుక్క

కుటుంబ పరిస్థితులూ, ఆర్థిక స్తోమతా కాకి భాషలో వివరించాడు కాకేశం. అతని స్తోమతకి తగ్గ యిల్లు కావాలన్నాడు. కాకి కూడా యిళ్ళు చూస్తూ మధ్య మధ్య కుక్క గురించి కాస్త జాలిగా మాట్లాడింది. తనకి వీలయినప్పుడల్లా కాసిని గోధుమ గింజల్ని ఏరు కొచ్చి కుక్క యింట్లో పోస్తానంది. కుక్కకి పిల్లలు ఎక్కువ కాబట్టి కాస్త పాల పొడి కూడా నోట్లో పట్టినంత తీసుకొచ్చి వుడతలా కాకి సాయం చేస్తానంది. చివరికి చాలా దూరం సైకిళ్ళు తొక్కించి ఓ యింటి మీద వాలింది కాకి. కుక్క, కుక్క మిత్రులు ఆ యింటిని సమీపించాక వాళ్ళ దగ్గర సెలవు తీసుకుని గద్ద లాగా ఎగిరి పోయింది.

మూర్ఛ రోగి మెళ్ళో లాగా టులెట్ బోర్డు వేలాడుతోంది ఆ యింటికి. వెనక్కి తిరిగి చూస్తే తల తిరిగింది కుక్కకి. ఒకటి కాదు, రెండు కాదు, మూడు కాదు ఆఫీసుకి అయిదు మైళ్ళ అవతల వుందా మూర్ఛ రోగి మెళ్ళో బోర్డు. అది మరీ అంత పెద్ద వూరేమీ కాదు. దాని ప్రాణానికి అయిదు మైళ్ళంటే స్మశానం కూడా దాటి పోవడ మన్నమాట. అదో పాత కొంప. ఆత్మ హత్య చేసుకుందామని కిరసనాయిలు ఒళ్ళంతా పోసుకుని అగ్గి పుల్ల వెలిగిస్తే మధ్యలో ఎవరో వొచ్చి ఆర్పేస్తే బతికిన దాన్లా వుందా యిల్లు. యజమాని కూడా బూజు పట్టిపోయి, చిలుం పట్టి పోయి వున్నాడు. ఆ ఇంటికి, ఇంటి యాజమానికి సున్నాలు వెయ్యడం అవసరమన్నాడు కాకేశం.

ఇంటి యజమాని బ్రహ్మజెముడు పొదలా వున్న నోరు తెరిచి కుక్కని చాలా ప్రశ్నలడిగాడు, పెళ్ళయిందా? అయితే ఎంత మంది పెళ్ళాలు? పిల్లలున్నారా? వుంటే బయట ఎంత మంది? ఇంట్లో ఆవిడకి ఎంత మంది? ఇటువంటి ప్రశ్నలు కూడా వేశాడు. అతని మిత్రుల వంక తిరిగి వీళ్ళంతా రోజూ వొచ్చి పేకాడతారా, మందు కొడతారా? అని కూడా అడిగాడు. అతను కట్టుకున్న అంగోస్త్రాన్ని విప్పి, దులిపి మళ్ళీ నడుం చుట్టు బిగించి మరేం లేదు, యిది చాలా పెద్ద కొంప, యిందులో నాలుగు వాటాలున్నాయి. ఇప్పుడే ఒక వాటా ఖాళీ అయింది. మీరందులోకి రాబో తున్నారు కాబట్టి అక్కడ సహజీవనాన్ని దృష్టిలో పెట్టుకుని యివన్నీ అడుగుతున్నాను మరోలా అనుకోవద్దన్నాడు. అతనావిధంగా గుండు మీద చెయ్యేసి చక్కగా నిమురు కుంటూ చెప్పేక ఎవరూ మరోలా అనుకో లేదు.

సంభాషణ సజావుగానే నడిచిందిగానీ. అద్దె విషయం దగ్గరే కొంత ప్రతిష్టంభన ఏర్పడింది. ఇంటి యజమాని తన యింటి గొప్ప తనాన్ని చాలా ఆత్మ విశ్వాసంతో వివరించాడు. ఆ యింట్లో తను ఏర్పాటు చేసిన సౌకర్యాలేమిటో చెప్పాడు. ఆ నాలుగు వాటాలకి ఒక చిన్న దేవాలయాన్ని లోపలే ఏర్పాటు చేశాట్ట, తులసి కోట, అన్ని బాత్రూముల్లోంచి, వంటిళ్ళ లోంచి వొచ్చే నీరు చక్కగా ఒక కాల్వలా ప్రవహించే ఏర్పాటు కూడా చేశాట్ట. నుదిటి మీద అడ్డ గీతల వాళ్ళూ'- నిలువు గీతల వాళ్ళూ దెబ్బలాడుకోకుండా అడ్డం, నిలువు దూలాల అవసరం లేకుండా కప్పు ఏర్పాటు చేశాట్ట.

చివరికి, ఆ వూరి ఆకాశానికి, ఆ వూరి భూమికీ చెందిన క్షితిజ రేఖ మీద కనబడు

తున్నది ఆ ఒక్క కొంపే కావడంవల్ల, ఆ వూళ్ళో సముద్రాల్ని దాటి వ్యాపారం నిమిత్తం ఎవరన్నా అటుకేసి వొచ్చి యిల్లు కడితే తప్ప తనకి యిల్లనేది అద్దెకి దొరకదనేది నిర్ధారణ అయిపోయాక, బంధ్యం తిప్పుతూ కూచున్న ఆ యింటి యజమానికి అడ్వాన్సు యిచ్చేసి, ఆ బోర్డు పీకించేసి, తక్కిన మూడు వాటాల వాళ్ళూ ఈ జైల్లోకి రాబోయే కొత్త ఖైదీ ఎవరా అని వింతగా చూస్తుండగా "జానీ" అని ముద్దుగా పిలవబడే జానకమ్మ బెటాలియన్ని తీసుకురావడానికి యింటి కొచ్చేశాడు కుక్క. వొడ్డాణంలా పాత చీరని నడుం చుట్టూ కట్టుకున్న నడికట్టు జానకమ్మ వుగ్గు పడుతూనే తలుపు తీసింది.

## 3

పిల్లలకి యమహుషారుగా వుంది ఆయిల్లు చూస్తుంటే. ఎడారిలో ఎండిపోయిన చెట్టులా వుంది యిల్లు. కనుచూపు మేరలో ఎక్కడా స్కూలు కనబడక పోవడంతో మహాసంతోష పడిపోయారు. జానకమ్మకి మాత్రం ఎవరో చెయ్యి లోపలికి దూర్చి ఆవిడ గుండెని గట్టిగా ఆపేసినట్లయింది. గుళ్ళోభక్తితో మోయించేజేగంటని బలవంతంగా పీకి ఫైరింజన్కి కట్టి మోయిస్తూ పరిగెత్తించినట్లయింది.

"ఇదెక్కడిల్లు బాబోయ్, నన్నూ నా పిల్లల్నీ భూతాల నూతిలో దింపారు నాయనోయ్" అని అరుస్తూ కిందపడి కాళ్ళూ చేతులూ కొట్టుకుంటూ మూర్ఛబోయింది. అంతవరకూ బండిలోంచి సామాను దింపుతుంటే సర్కస్ చెయ్యబోయే కంపెనీ వాళ్ళని చూస్తున్నట్లు చూస్తూ పక్కనున్న మూడు వాటాల వాళ్ళూ కుక్కుటేశ్వర్రావ్ పిల్లలతో బాటు దగ్గరగా వొచ్చి, జానకమ్మ చుట్టూ మూగి వినోదం చూడ్డం మొదలెట్టారు.

"ఏంచేస్తాం, ఏదీ మన చేతిలోలేదు," అన్నాడొకాయన చుట్ట వెలిగిస్తూ, "మీరేమీయాతన పడనక్కర్లేదు; స్మశానం కూడా దగ్గర్లోనే వుంది. తక్కిన ఏర్పాట్లకి మేమున్నాంలెండి, అని కుక్కుటకి భరోసాయిస్తున్న ధోరణిలో.

కుక్కుటకి వొళ్ళు గడ్డివామిలా మండింది. సరే, దిగుతూనే గొడవపట్టం దేనికవీ, తనకి కోపం వొచ్చినప్పుడల్లా జానకమ్మ యీ విధంగా విరుచుకు పడిపోతుందనే సంగతి వీళ్ళకి తెలీదుగదా, అని సరిపెట్టేసుకుని "కంచెంబుతో కాసిని నీళ్ళు పట్టండిరా" అని పెద్దకొడుకు వేపు చూస్తూ అరిచాడు. పెద్దాడు వాలి గుహలో కెళ్ళినట్లు వెళ్ళి ఎంతకీ బయటికి రాలేదు. గుంపులోని గోవిందు డొకడు వేపాకుమండలూ, కుంకం, కొబ్బరికాయలు అవసరం అని లిస్టు చదువుతున్నాడు.

"ఏం జేస్తున్నవ్రా గాడిదా, చెంబుతో నీళ్ళు పట్టమ్మంటుంటే" అని మళ్ళీ గాండ్రించాడు కుక్కుటేశ్వర్రావ్. పెద్ద పుత్రుడు చాలా సీరియస్గా బయటికొచ్చి-"ఎందుకలా అరుస్తారు, నీళ్ళు సరే, అసలు కంచెంబే కనబడ్డంలేదు" అన్నాడు.

"కంచెంబు కనబడకపోతే గ్లాసుతో పట్టుకూడదటా" అన్నాడు కుక్కుట.

"ఆ సంగతి ముందే చెప్పొచ్చుగా" అనేసి మళ్ళీ లోపలికెళ్ళాడు పెద్ద పుత్రుడు.

తక్కిన పిల్లలు, తక్కిన వాటాల వాళ్ళతోబాటు మోకాళ్ళ మీద నుంచోని మోళీ చూస్తున్నట్టు చూస్తున్నారు తప్ప ఆ పడిపోయింది వాళ్ళమ్మ అనే జ్ఞానమే వాళ్ళకి లేదు, పైగా "అమ్మ

ఛలేగా పడిందిగదరా'' అంటున్నాడు రెండో వాడు. వాడితో అంతా ఏకీభవిస్తున్నారు.

పెద్దపుత్రుడు యీ సారి వుత్త గ్లాసు నూపుకుంటూ బయటికొచ్చి ''రాత్రి పన్నెండు దాటాక గాని పంపులో నీళ్ళు రావుటండీ'' అన్నాడు.

''పక్కింట్లో కెళ్ళి పట్రాగూడదంట్రా'' అన్నాడు కుక్కు, వస్తున్న కోపం దేని మీద, ఎవరి మీద, ఎలా ప్రదర్శించాలో తెలీక.

''పక్కింట్లో కెళ్ళి దేంతో పట్రమ్మంటారో యీసారన్న ఖచ్చితంగా చెప్పండి, యిన్ని సార్లు తిరగలేను'' అన్నాడు పెద్ద పుత్రుడు.

లాగూ జేబులో పోసుకురారా అన్నాడు కుక్కు పూనకం వచ్చిన వాడిలాగా.

ఏ మాటకామాటే చెప్పుకోవాలి, పెద్ద పుత్రుడు సాక్షాత్తూ శ్రీరామచంద్రుడు. గ్లాసు అక్కడే పడేసి, లాగూ జేబు ఎక్కడ పారిపోతుందోనన్నట్లు రెండు చేతుల్తోనూ పట్టుకుని లోపలి కెళ్ళాడు. ఈసారి కుక్కుకే మూర్ఛ వచ్చినంత పనయింది. ఇప్పుడు గనుక తను గూడా పడిపోతే వీళ్ళు తనని సహగమనం చేయించేస్తారని, పెద్ద పుత్రుడు పడేసిన గ్లాసు తీసుకుని దగ్గరగా కనబడుతున్న చెరువుకేసి పరిగెత్తాడు - చెరువు మీద అలగడం తప్పని తెలిసిన కుక్కు ఉేశ్వరావ్.

''ఎదురుగా సూపర్ బజారూ, పక్కన ధర్మాసుపత్రీ, పక్కింట్లో చేబదుళ్ళిచ్చే వాళ్ళు, యింట్లో ఎప్పుడు తిప్పినా నీళ్ళొచ్చే నాలుగు పంపులూ, పిల్లలు బంతులు ఎగరేసి ఆడుకున్నా పగలని లైటు బల్బులూ వున్న కొంప చూసుకుంటారుగాని, యిదేం కొంపండీ! ఎదురుగా స్మశానం, పక్కన దాని కోసమే తవ్విన చెరువు, రాత్రి పన్నెండు తర్వాతగాని నీళ్ళురాని కుళాయి. యిదేం కొంపండీ?'' అని పిల్లలూ పెద్దలూ జడుసుకునేట్లు మాట్లాడుతూ లేచింది జానకమ్మ, చెరువు నీళ్ళు ముఖం మీద పడగానే.

'మేం కాపరాలు జెయ్యడం లేదా తల్లీ; కిందటి జన్మలో ఏం పెట్టి పూజ చేశామో ఈ మొగుళ్ళు దొరికారు. చిత్రవధ చెయ్యడానికన్నట్టు యిక్కడికి తీసుకొచ్చిపడేశారు' అని తక్కిన మూడు వాటాల ఆడాళ్ళు ముక్కులు చీదెయ్యడంతో జానకమ్మ ఎంత గింజుకున్నా ఆ యింట్లోనే ఎనిమిది మంది తర్వాత మళ్ళీ కాపురం జెయ్యక తప్పలేదు.

## 4

కుక్కు ఉేశ్వరావ్ పాత వ్యాళ్ళో లాగానే తన శరీరంలోంచి కొన్ని భాగాలు బయటికి తీసి వేసిన ఆ సైకిల్ మీద యధావిధిగా రోజూ ఆఫీసుకెళ్ళొస్తున్నాడు. అయితే నాలుగు రోజుల్లోనే తెలిసిపోయిందతనికి- తను పని జేస్తున్నది ఫలానా ఆఫీసులో ఫలానా వుద్యోగం కాదని, వల్లకాట్లో రామనాధం వుద్యోగమనీ. అర్ధరాత్రనీ, అపరాత్రనీ లేకుండా హఠాత్తుగా వున్నట్లుండి ఘొల్లుమని ఏడుపులు, పెడబొబ్బలు, భగ్గున మంటలు, చెరువులో బుడుంగుమని స్నానాలు ఆ యింట్లోనే ఎవరో పోయినట్లయి అంతా ఠఖ్ళన తలుపులు తీసుకుని బయటికొచ్చి చూడ్డం, సిగరెట్లు బీడీలు చుట్టలు వెలిగించుకోడం కాసేపు స్మశాన వైరాగ్యం మాట్లాడుకోడం తిరిగి పెళ్ళాల దగ్గరికి జేరడం మామూలయిపోయింది.

ఇంక కుక్కు ఇంట్లో కొద్దాం. నాలుగు వాటాల వాళ్ళూ నానా జాతి సమితిలా వున్న చుట్టుపక్కలవాళ్ళు తప్ప మరెవరూ లేక

పోవడంతో ఎవరిమీద ఎవరికి ఎవరు ఏం చెప్పుకోవాలో తెలీక పెళ్ళాలు మొగుళ్ళకీ, మొగుళ్ళు పెళ్ళాలకీ యింకో మొగుడూ పెళ్ళాల గురించి చెప్పుకుంటూ బలవంత సఖ్యతతో రోజులు గడుపుతున్నారు. నీళ్ళు మొగుళ్ళే పడుతుండడం వల్ల కుళాయి దగ్గర భీషణ పోరాటాలు లేవు. తులసికోట చుట్టూ మొగుళ్ళే తిరుగుతూ సూర్య నమస్కారాలు చేస్తుండడం వల్ల తులసి నవనవలాడుతూ కన్నుల దళాల్తో పచ్చగా చూస్తోంది. ఇంక బాత్రూం పక్కన చిన్న సందులాంటి చీకట్లో సిమెంటు దిమ్మ కట్టి యింటి యజమాని దాన్ని దేవాలయమన్నాడు. ఆ దిమ్మ మీద మొదట రాంబాణం మార్కు శ్రీరామ చంద్రులవారి బొమ్మ యజమాని ప్రతిష్టించాడుగాని, మొదట్లో ఆయా వాటాల్లో ఉన్నవాళ్ళు తలొక దేవుడి భక్తులూ కావడం వల్ల కించిత్ దైవ దూషణ జరిగింది. ఇంటి యజమాని యింటికి వెల్లవేయక పోయినా, ఫస్టు తారీకల్లా నిక్కచ్చిగా బొడ్లో చేయి దోపి అద్దె వసూలు చేసుకుపోయే రకమయినా అహింస, సర్వమానవ ప్రేమలో నమ్మకం గలవాడవడం వల్ల, తన యిల్లు పదికాలాలపాటు పదిలంగా వుండాలనే దృష్టితోనే నయినా దేవాలయం విషయంలో వాటాలవాళ్ళతో గొడవలు రాకుండా ఒక ఏర్పాటు చేశాడు ఎవరు ఏ దేవుణ్ణి కొలుస్తారో ఆ దేవుడి బొమ్మ తీసుకొచ్చి దేవాలయంలోని దిమ్మమీద శ్రీరాములవారి బొమ్మని దించి, వారి దేవుడి బొమ్మ పెట్టుకుని పూజ చేసుకోవచ్చు. తిరిగి మరొకరు వస్తారు. వారి దేవుడిబొమ్మ వారు తెచ్చుకుని దానిమీద పెట్టుకుని పూజ చేసుకుంటారు. ఈ పద్ధతి ప్రకారం పరదైవ సహనం కొంత ఏర్పాటయి సహజీవనం, సఖ్యత ఆ వాటాల్లో మూడు మతాలూ ఆరు నైవేద్యాలుగా వర్ధిల్లుతోంది.

## 5

ఆ దేవుళ్ళలో ఎవరికి ఏం తక్కువ జరిగిందోగాని ఆ యింటికి ఓ వుపద్రవం వచ్చిపడింది. గోడలన్నీ మామూలుగానే వున్నయ్. తలుపులన్నీ మూసే వున్నయ్.

ప్రతివారం చదవండి
ప్రతిసారీ మనిషిగా ఎదగండి

ఎవరి వాటాల్లో వాళ్ళు కాపురం జేస్తూనే వున్నారు. కానీ, మధ్య వాటా కాంతారావింట్లో దొంగతనం జరిగింది! సాక్షాత్తూ కాంతారావు పెళ్ళాం కాంతమ్మ మెళ్ళో రాళ్ళ నెక్లెస్, కాంతారావు పక్కలో వుండగానే, రాత్రికి రాత్రే మాయమైపోయింది. కాంతమ్మకి ప్రయివేట్‌గా కాంతారావు మీద అనుమానం వున్నదనుకోండి; అది వేరే విషయం. రాళ్ళ నెక్లెస్ పోవడంతో కొండ రాళ్ళని పిండి కొట్టేసినంత హంగామా చేసేసింది కాంతమ్మ. ఆవిడ నోరు పాత భోషాణం పెట్టంత వుంటుంది. కర్ణుళ్ళా సహజ నోటితో పుట్టిందావిడ. ముందు నోరే బయట పెట్టిందని వాళ్ళమ్మమ్మగారంటుండేవారు - అది వేరే విషయం.

కాంతమ్మగారు కనబడని దొంగగారిమీద ఎంతగా నోరు చేసుకున్నా, పోయిన నెక్లెస్ ఆవిడ మెళ్ళోకొచ్చి పడలేదు. ఎంత ప్రార్థించినా దేవుళ్ళు బిక్కమొహాలేసు క్కూచున్నారు. చివరికావిడకే విసుగొచ్చి ఆ నెక్లెస్ కాజేసిన వాడి బొంద ఎదురుగా వున్న స్మశానంలోనే అతి త్వరలోనే కట్టెలుకూడా లేకుండా కాలుతుందని శపించింది. చిన్నదా చితకదా, వడ్డాణమంతటి నెక్లెస్ పోతే ఆవిడ శపించదూ! వడ్డాణ మంతటి నెక్లెసా ? అని ఎవరన్నా విస్తుబోతే ఆమేంజెయ్యగలదు? ఆవిడ మెడ అంత చిన్న సైజుది పాపం! తలా మెడా అన్నీ కలిసిపోయినై — అది వేరే సంగతి.

ఆవిడ ఆ దొంగగాడ్ని కొడుకుని తిట్టితిట్టి శపించి వుపశమించే సమయానికి దక్షిణదిశనున్న వెంకట్రావు వాటాలోని గంగాళం; యింతలేసి దండకడియాల్లాంటి రింగులున్న గంగాళం. నలుగురు మొగ మనుషుల కూడా కదలడానికి [illegible] గంగాళం, ఆ రింగుల్తో సహా మాయమైంది; యింకేముంది! వెంకట్రావు పెళ్ళాం వెంకాయమ్మ మంచమెక్కేసింది. ఇవ్వాలో రేపో అన్నట్టుగా అయిపోయింది. అది ఆవిడకి అరణీ్ం వచ్చిన గంగాళమాయె! దాన్ని ముట్టుకోడమేగాక, పట్టుకుపోవడానికి వాడికెన్ని గుండె లుండాలి! ఆ గంగాళమంటే ఆవిడకి ప్రాణం. దాంట్లోనే ఆవిడ గుండె కొట్టుకుంటుంది. పెళ్ళయిన దగ్గర్నుంచీ, మరీ ముఖ్యంగా వేరు కాపరం పెట్టించిన దగ్గర్నుంచీ ఆవిడతోనే, ఆవిడ ప్రాణంలో ప్రాణంగా, ఆవిడ శరీరంలో ఒక భాగంగా వుంటోందా గంగాళం. ఆవిడ తడికెల బాత్రూంలో కెళ్ళి స్నానం చెయ్యడానికి బద్ధకించే వేళ యింత పసుపు, తదితర పోపుసామాన్లు తీసుకుని పెరట్లో ఒక నీడగా వుండే యీ గంగాళంలోనే కుదుమట్టంగా కూచుని, వెనకటికి అంతఃపురాల్లో ఏడు మల్లెపువ్వు లెత్తు రాజకుమార్తెలు పన్నీరుస్నానం చేసినట్లుగా గంగాళస్నానం చేసేదావిడ. ఆవిడేకాదు; ఆ గంగాళం పోయిందంటే అన్ని వాటాల్లోని ప్రజలూ ఆశ్చర్యపోయారు. కారణం, ఆవిడే అసలు అన్నదాన సమాజంవారి గుండిగలా వుంటుంది. మరి ఆవిడస్నానం చేసేప్పుడు ఆవిడ్ని అందులో సుఖాసీనురాల్ని గావించే ఆ రింగుల గంగాళం ఎంత దొడ్డదయ్ వుండాలి! అందువల్ల, ఆ గంగాళం పోవడమంటే ఆవిడ మానాన్నే ఎవరో మాయంజేసినట్లు ఫీలయిపోతున్నదావిడ.

ఇలా ఆ యింట్లోని 50 శాతం వాటాల్లో దొంగతనాలు జరిగే టప్పటికి తక్కిన 50 శాతం వాళ్ళు శాంతాన్నొదిలి జాగ్రత్తపడిపో

డానికి ప్రయత్నించేరు. అందుకు నాందిగా, యికముందు తీసుకోవలసిన చర్యలగూర్చి ఆ యింటి సావిట్లోనే నాలుగు వాటాలవాళ్ళూ పిల్లా జెల్లాతో సహా కూర్చుని సభలూ, సమావేశాలూ జరిపారు. "దొంగలు-వారి పద్ధతులు" అనే అంశంమీద సెమినార్లు నిర్వహించారు. అదే అంశంమీద సుబ్బారావుగారి భార్యామణి హనుమాయమ్మ గారు తమ యిద్దరు పిల్లలకీ రెండు తపేళాలిచ్చి బుర్ర కథ చెప్పారు. అదే అంశంమీద వెంకటేశ్వర్రావు ఏకపాత్రాభినయం చేశాడు. చివరికి రోజుకొక మగాడు రాత్రంతా మేలుకుని మొత్తం యింటిని కాపలా కాయాలనీ, దొంగని పట్టుకోవాలనీ, పట్టుకున్నాక పట్టుకున్నామనీ గట్టిగా అరవాలనీ, తక్కిన వాటాల వాళ్ళంతా వొచ్చాక దొంగని తాళ్ళతో కట్టెయ్యాలనీ నిర్ణయం చేశారు.

నిర్ణయమైతే చేసేశారు, కానీ, అసలే చలి కాలం, చీకటి రోజులు, దానికితోడు పెళ్ళాల్నొదిలి ఎదురుగా స్మశానం, మర్రిచెట్టు, చెరువు పెట్టుకుని ఆ వొచ్చే దొంగగారికోసం కాపలాకాయడమంటే జిలేబీ తినడం కాదని అందులో ముగ్గురికి తెలిసిపోయింది. నాలుగో వాడు సుబ్బారావుకి మాత్రం యింకా తెలీలేదని; లేక తెలిసే తనముందు 'నైట్ డ్యూటీ' అంత సుఖమైంది మరొకటిలేదని కోస్తున్నాడనీ తక్కిన ముగ్గురికీ అనుమానం వొచ్చింది. తక్కినవాళ్ళు కుయ్యో మొర్రోమని పడుతూ లేస్తూ ఆకు కదిలితే దెయ్యాల కథలన్నీ గుర్తొస్తుంటే, వీరహనుమాన్ బొమ్మని నెత్తిమీద

---

## వచ్చే వారం:

- భార్యలు పని మనుషులా? (ప్రత్యేక వ్యాసం)
  — రమాదేవి
- వ్యభిచారిణులతో, బ్రోకర్లతో —
  'ఎన్. ఇన్నయ్య' ముఖాముఖీ
- "వేర్ ఏంజెల్స్ ఫియర్ టు ట్రెడ్..." (కథ)
  —కంఠంనేని రాధాకృష్ణ మూర్తి
- ప్రయోగాత్మక 'ఏలోమ కథ'
  'లైకా-మజ్నూ ప్రళయగాథ' ముగింపు
- 'అనంతం'లో శ్రీశ్రీ చైనాయాత్ర విశేషాలు
- సావేరి • రాజు - పేద • సినీతంత్ర
- బాలతంత్ర — ఇంకా ఇతర ఆకర్షణలు.

పెట్టుకుని వొణికిపోతూ డ్యూటీ చేస్తే, సుబ్బారావు మాత్రం మెళ్ళో మఫ్లర్ చుట్టుకుని, స్టయిల్‌గా కర్రపట్టుకుని పరమహుషారుగా ప్రేయసిని కలుసుకోడాని కెడుతున్న వాళ్ళా యీలేసుకుంటూ నైట్ డ్యూటీ సునాయాసంగా చేసేస్తుంటే - 'దీనిలోని రహస్యమేమిటో నాక్కూడా చెప్పరాబాబూ' అని ఆంతరంగికంగా బతిమాలేడు వెంకట్రావు, తక్కిన వాళ్ళు కూడా అదే పల్లవిలో సుబ్బారావుని అడిగారని తెలీపతనికి.

"కారణం లేకుండా ఏదీ వుండదు. అది జీవిత రహస్యం. దాన్ని నిజంగానే రహస్యంగా వుంచితే చెబుతాను" అన్నాడు సుబ్బారావు. ఎవరికీ చెప్పనని ఒట్టేసి, చెవులు పట్టుకుని మూడు గుంజీలు తీసి విఘ్ననాయకుడి దగ్గర ఎలకలా కూచుని రహస్యం విన్నాడు వెంకట్రావ్.

"మరేం లేదు భాయ్. కామన్సెన్సు వుంటే యిందులోని రహస్యం యిట్టే అర్థమైపోతుంది, నేనింత సంతోషంగా ఎలా యీ కాళరాత్రుళ్లలో నైట్ డ్యూటీ చేస్తున్నానా అని ఆశ్చర్యపోతున్నారు, మిమ్మల్ని చూస్తే, మీ వొణుకు చూస్తుంటే నాకు జాలేస్తోంది. నాలుగు రోజుల కొకసారి పెళ్ళాం బారి నుండి బయటపడి, ఉప్పు లేదు, పప్పు లేదు, సింగినాదం లేదు, జీలకర్ర లేదు అని వినబడే ప్రత్యేక ప్రసారం నుండి విముక్తి కలిగి, యింటి దగ్గరే స్వేచ్ఛగా తిరిగే అవకాశం దొరికితే అంతకంటే సంతోషించ దగ్గది ఏముంది పిచ్చి నాయన్నాలా" అని జ్ఞాని పోజులో చెప్పాడు సుబ్బారావు అంతే. జీవిత రహస్యం తెలిసిపోంగానే అంతా చక చకా భోజనాలు చేసేసి పరమ హుషారుగా నైట్ డ్యూటీలు చేసెయడం మొదలెట్టారు.

(ముగింపు వచ్చేవారం)

## చంద్ర కథకి 'యూత్ టైమ్స్' బహుమతి




సుప్రసిద్ధ చిత్రకారుడు, కథారచయిత శ్రీ చంద్ర రచించిన '*A LOVE STORY*' అన్న చిన్న కథకి, ఇటీవల 'యూత్ టైమ్స్' పత్రికవారు నిర్వహించిన కథల పోటీలో కన్సొలేషన్ బహుమతి లభించింది. ఆంధ్రప్రదేశ్ నుంచి అందిన ఎంట్రీలలో **30** ఇంగ్లీషు కథలను పోటీకి స్వీకరించారు. అందులో ఏ కథకీ బహుమతి లభించలేదు. ప్రాంతీయ భాషలనుంచి ఇంగ్లీషులోకి అనువదించబడిన కథలను కూడా 'యూత్ టైమ్స్' పోటీకి ఆహ్వానించింది. ఈ శ్రేణిలో శ్రీ చంద్ర కథని బహుమతియోగ్యమైనదిగా న్యాయనిర్ణేతలు నిర్ణయించారు. ప్రముఖ రచయితలు శ్రీ ముల్క్‌రాజ్ ఆనంద్, శ్రీ కానా సుబ్రహ్మణ్యం, శ్రీ హమీదుద్దీన్ మహమూద్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ విజయసందర్భంలో చంద్రకి హృదయపూర్వకమైన అభినందనలు.